# నొప్పించక... తానొప్పక...

## ఇచ్ఛాపురపు రామచంద్రం

భర్తకి భోజనం పెట్టి షాపుకి పంపి...తనూ భోంచేసి—వంటిల్లు కడిగి—భుక్తాయాసంతో—కాస్సేపు మేను వాల్చుదామని—కృష్ణా, రామా అని ఆపసోపాలు పడుతూ—జానకమ్మ ముందు గదిలోకి వచ్చేసరికి—చటుక్కున గుర్తుకొచ్చింది భర్త భోజనానికి వస్తూ తెచ్చి అందించిన ప్యాకెట్ విషయం. ఆ ప్యాకెట్ వాటమూ, దాన్నుంచి వచ్చే వాసనా—చీరేమో అనుకుంది బీరువామీద పెడుతూ అప్పుడు.

రేపు దీపావళి. రేపే తన పుట్టినరోజు. దీపావళి నాడు కావడంతో ఎన్నేళ్ళు వచ్చినా, ఎంత ముసలిదైపోయినా పుట్టినరోజుని మరచిపోవడం సాధ్యం కాదేమో, తనకీ తన ఇంట్లోవాళ్ళకీ! భర్త తనకి పుట్టినరోజుకి చీర తెచ్చాడా? ఈ వయసులో... పుట్టిన రోజుకి కొత్త చీర!... నవ్వొచ్చింది. ఏం చీర తెచ్చారో? ఎలాటిదో? ఏ రంగుదో? ఆత్రంగా ప్యాకెట్ అందుకుని... వణుకుతున్న వేళ్ళతో మెల్లగా తడబడుతూ తెరిచింది. ఒక క్షణం తన కళ్ళని తానే నమ్మలేకపోయింది.



కలయో వైష్ణవమాయయో అనిపించింది. కళ్ళు తుడుచుకుని మరీ చూసింది. నెమలి కంఠం రంగు కంచిపట్టు చీర. మామిడి పిందెల అంచు! వెండి జరీ! ఆమె ఆనందంతో తబ్బిబ్బు పడిపోయింది. సంతోషం పట్టలేకపోయింది. సరిగ్గా ఇలటి చీరే...ఇదే... తను ఇన్నాళ్ళూ, ఇన్నేళ్ళూ కోరుకున్నది. ఇవాళ వారు తెచ్చారు! రేపు...పుట్టినరోజుకి కట్టుకోమని.

ఈ చీరకోసం తను సిగ్గు విడిచి ఎన్నిసార్లో అడిగింది వారిని. లెక్కలేనన్నిసార్లు. తక్కువ జీతం, పెరగని ఆదాయం... పెరిగే ఖర్చులు... పిల్లలు... వాళ్ళ అవసరాలు... ఒంట్లో బాగులేకపోవడాలు...మందుల ఖర్చులు...పిల్లల చదువులు...జీతాలు... పెద్దమ్మాయి పెళ్ళి...అప్పు...వడ్డీలు కట్టడం...అప్పులు తీర్చడం...అర్థాంతరంగా రిటైరవడం...ఎప్పటికప్పుడు...ఏదో ఒకటి...తనకీ పట్టుచీర కొనడాని కడ్డుపడుతూనే ఉండేది. చివరకు —అమ్మాయి పెళ్ళికి కూడా తను కోరుకున్న పట్టుచీర కట్టుకుని పీటలమీద కూర్చోలేకపోయింది దురదృష్టవశాత్తూ. పగబట్టినట్లు ఏవో పరిస్థితులు తన కోరికను .తీరకుండా కాటువేసేవి. ఎంత బలమైన కోరికని ఈ పట్టుచీర! పిల్లల ముందు కూడా బయటపడిపోయేది. పట్టుచీర కొనని భర్తకి తనమీద ప్రేమానురాగాలు



లేవేమో అని సందేహించేది. పండగ పూటా...పట్టుచీర కట్టుకోలేని తన దురదృష్టానికి—చుట్టూ ఉన్న వాళ్ళమీదా, ఆయనమీదా కోపం తెచ్చుకునేది. తన సంసారం ఒక విధంగా సజావుగానే సాగింది. కోరికలు తీరకపోయినా—సమస్యలూ, బాధలూ ఇంటిని తినెయ్యలేదు. అందుకు సంతోషించవలసిందే.

"జానకీ! అమ్మాయికి పెళ్ళి చేశాం...విష్ణు పెద్దవాడౌతున్నాడు. నీ కింకా పట్టుచీర మీద కోరిక మిగిలి ఉందా? ఏమిటో... ఎంత ప్రయత్నించినా... ఎప్పటికప్పుడే ఏదో అవాంతరం. నీ కోరిక తీర్చడం కుదరడమేలేదు. క్షమించు...పోనీలే... రేపు నీ కొడుకు ఉద్యోగస్థుడయ్యాక కొంటాడులే" అన్నారు వారు చివరకి.

"అలాగే అమ్మా" అన్నాడు దగ్గరలోనే ఉన్న విష్ణు.

పులిమీద పుట్రలా వచ్చిపడింది ఆయన అర్ధాంతరపు రిటైర్మెంటు. విష్ణుకి చిన్నదో, చితకదో ఉద్యోగం వచ్చింది కనుక కానీ లేకపోతే తామేమై పోయేవారో!

"ఏభై అయిదుకి ప్రభుత్వం రిటైర్ చేసినా పరిస్థితులు రిటైర్ చేయలేదు నన్ను. చిన్నవాడు విష్ణుమీద అంత భారమూ మోపబుద్ధి కావడంలేదు. ఏదో... వేణ్ణీళ్ళకి చన్నీళ్ళుగా ఉంటుందని—నేను ఓ షావుకారు కొట్లో పని సంపాదించుకున్నాను. నెలకి నాలుగు వందలు..."

బాగానే ఉందనిపించింది తనకి. అయితే ఉదయం నుంచి రాత్రివరకూ ఆయన కష్టపడడం చూస్తూంటే జాలేస్తుంది. సంసార భారం ఎంత టిది! ఆయన ఎంత కష్టపడి జ్ఞాపకం పెట్టుకుని... తన పుట్టినరోజు కీ చీర తెచ్చారో! ఎన్ని విధాలుగా కూడబెట్టారో దీనికోసం! పట్టుచీర...వెండిజరీ...ఈ రోజుల్లో ఎంత లేదన్నా అయిదు వందలుండకపోదు. అయిదు వందలు!

ఆయనకి తనంటే ఎంత ప్రేమ! ఎంత అనురాగం!! తను అర్థం చేసుకోలేకపోయింది కానీ... వారికి తనంటే ప్రాణమే. వారిని భర్తగా పొందడం తన అదృష్టం. పూర్వజన్మ పుణ్యం.

జానకి—ఆ పట్టుచీరను కొంచెం విప్పి వెడల్పు చూడడానికా అన్నట్లు భుజంమీద వేసుకుంది. ఆ పట్టుచీర స్పర్శకి ఆమె శరీరం పులకరించింది. అచ్చంగా భర్త తనని సున్నితంగా...అంటీ అంటనట్టుగా కౌగలించుకున్నట్లు ఒళ్ళంతా పులకింతలు పోయి— సిగ్గుతో ముఖం ఎర్రబడింది. కొన్ని క్షణాలు ఆ మధురానుభూతిలో మునిగి... హఠాత్తుగా ఆమె ఏదో గుర్తుకి వొచ్చినట్లు...పట్టుచీర మడత పెట్టి మంచంమీద ఉంచింది. బీరువా తెరిచి—పై అరలోంచి ఉదయం భోజనానికి వస్తూ విష్ణు తెచ్చిన పాకెట్ అందుకుంది. వాడు పది గంటలకు వస్తాడు. భోంచేసి వెళ్ళిపోతాడు డ్యూటీకి.

"నీ కోసమే అమ్మా... రేపు నీ పుట్టినరోజు కదా!" అంటూ ఆ ప్యాకెట్టిచ్చాడు. వాడికి భోజనం పెట్టే తొందరలో అదేమిటో అప్పుడు చూడనేలేదు. ఇప్పుడు చూడాలి. మెల్లగా ఆ ప్యాకెట్ తెరచింది మంచంమీద కూర్చుని. ఆమె కానందంగా ఉంది. ప్రయోజకుడైన కొడుకు తనకి పుట్టినరోజుకి కానుక ఇచ్చాడు. ఎంత సంతోషంగా ఉంది తలుచుకుంటూంటే. కొడుక్కి తనమీద ఎంత అభిమానం!

'భగవంతుడా! భర్త అనురాగం, కొడుకు అభిమానం నాకు కడదాకా కరుణించు తండ్రీ. ఇంతకంటె నాకే సంపదా వద్దు...' చెమర్చుతున్న కళ్ళు తుడుచుకుని, పాకెట్‌లోంచి చీర బయటకు తీసింది. అంతే! ఆమె ఒక్కసారి ఆశ్చర్యం పట్టలేకపోయింది. నెమలి కంఠం రంగుచీర. వెండి జరీ మామిడి పిందెల అంచు. కంచిపట్టు చీర!

నిజమా?... తను భ్రమ పడడంలేదు . కదా? కొడుక్కి తనమీద ఇంత అభిమానమా? ఆనాడు ఊరికే అన్నాడేమో అనుకుంది. ఊహుఁ. మాట నిలుపుకున్నాడు. గొప్ప మనసు నిరూపించుకున్నాడు. ఇటువంటి కొడుకుని కన్న తను ధన్యురాలు.

చీరను ఆప్యాయంగా ఒడిలో ఉంచుకుంది. అంతే విష్ణు వచ్చి తన ఒడిలో ఉన్నట్టే అనిపించింది. మాతృత్వంతో ఆమె హృదయం పులకరించింది. ఆ పట్టుచీర స్పర్శ మెత్తగా విష్ణులాగే చిన్నప్పటి కొడుకులాగే. ఆమె కళ్ళు మూసుకుంది. ఎంత సేపు అలా పరవశంతో ఉండిపోయిందో! గడియారం గంట కొట్టింది. రెండున్నర

ఆమె తుళ్ళిపడింది. పాతకాలపు బీరువా తలుపు కున్న అద్దంలో తన ప్రతిబింబం. మంచంమీద తను. తనకి రెండు పక్కలా రెండు చీరలు. నెమలి కంఠం రంగు, మామిడి పిందెల అంచు, వెండి జరీ, కంచిపట్టు చీరలు. అవి రెండూ బింబ ప్రతిబింబాల్లా ఉన్నాయి.

ఒకటి భర్త అనురాగంతో ఇచ్చినది.

రెండోది కొడుకు అభిమానంతో తెచ్చినది.

ఇద్దరి కోరికా ఒకటే-తాము తెచ్చినది రేపు కట్టుకోవాలి.

పుట్టిన రోజు తను తెచ్చిన చీర కట్టుకుంటే భార్యని చూసి సంతోషిస్తా రాయన. ఇప్పటికయినా భార్య కోరికను తీర్చగలిగానన్న తృప్తీ, గర్వం లభిస్తాయి వారికి. విష్ణు మాత్రం? తను తెచ్చిన చీర అమ్మ పుట్టిన రోజునాడు కట్టుకుంటే వాడికి కొండెక్కినంత సంబరంగా ఉంటుంది. వాడి కెప్పుడూ అమ్మంటే అంత అభిమానమే. చిన్నవాడు. వాడిని చిన్నబుచ్చకూడదు. వాడు తెచ్చినది కట్టుకోవడమే న్యాయం.

కాదేమో! ఆయన ఎంతో కష్టపడి తెచ్చారు. తన కోరిక తీర్చడాని కాయన చేసిన అవిరళ కృషీ, శ్రమా ఈ చీరలో ఉన్నాయి. భర్తగా ఆయన సాధించిన విజయ మిది. వయసు పైబడితే మాత్రం ఆయన పురుషుడు కారా, తను స్త్రీ కాదా? ఆయన పురుషాహంకారాన్ని తృప్తి పరచడం తన విధి కాదూ స్త్రీగా? స్త్రీకి పతియే కదా దైవం? అదేగా పురాణాలు చెప్పేది? ధర్మశాస్త్రాలు ఘోషించేది? కనుక వారు అనురాగంతో తెచ్చి ఇచ్చిన చీర కట్టుకోవడమే ధర్మమేమో! మరి స్త్రీకి బాల్యంలో తండ్రీ, యౌవనంలో భర్తా, వృద్ధాప్యంలో పుత్రుడూ అంటారు. తను వృద్ధురాలే. ఆ లెక్కన కొడుకుకి పెద్ద పీట వెయ్యడమే యుక్తమేమో!

ఏం చేయాలి?


రేపు ఎవరు తెచ్చిన చీర కట్టుకోవాలి?

ఆవిడ కొక్కసారి కలవరపాటు కలిగింది. ధర్మసంకటంలో పడినట్లు మనసు గిజగిజ గింజుకుంది.

వారు తెచ్చిన చీర మానేస్తే? కృతఘ్నురాలనుకుంటారేమో! తనమీద ప్రేమ లేదనుకుంటారు. దాంపత్య జీవిత మనే ఏరు దాటాక భర్త అనే తెప్పను తగలేసిన విశ్వాసం లేని భార్యగా తలుస్తారు తన గురించి. తనని నిర్లక్ష్యం చేసిందని కోపగిస్తారు. ఇన్నాళ్ళూ తమ మధ్యకు రాని కలతలూ, కలహాలూ ప్రారంభమౌతాయేమో! వారు ప్రేమతో తెచ్చిన పట్టుచీర పుట్టిన రోజునాడు కట్టుకోకపోతే. మూడేళ్ళు సాముచేసి మూలనున్న ముసలి ముండను కొట్టినట్లు-ఇన్నాళ్ళూ సవ్యంగా ఉండి ఇప్పుడింత వయసొచ్చాక ఎడముఖం పెడముఖం అయితే ఏం బాగుంటుంది? నిజానికి వారిమీద చెక్కు చెదరని అనురాగమే ఈ నాటికీ.

పోనీ-విష్ణు తెచ్చిన చీర వదిలేస్తే? ఏమనుకుంటాడు? అమ్మ కింత వయసు వచ్చినా భర్తమీదే తప్ప తనమీద కొంచెమయినా అభిమానమూ, ప్రేమా విలువా లేవనుకుంటాడు. అసలే చిన్నవాడు. తొందరపాటుతో ఎలాగైనా ప్రవర్తించవచ్చు. ఆవేశమే తప్ప ఆలోచన తక్కువ కావడం వాడి విషయంలో-ఆ వయసు దృష్ట్యా సమంజసమూ, సమర్థనీయమూ కూడా. తక్కువ జీతమే అయినా వాడెంతో కష్టపడి కూడబెట్టి కొన్న చీరను తను వాడు చెప్పిన సందర్భంలో కట్టుకోకపోతే వాడికి కోపం రావడంలో తప్పేముంది? ఈ కోపం తరువాత కూడా ఉంటే రేపు తను వాడిమీదే ఆధారపడి ఉండాలి. అప్పుడు పరిస్థితులేమీ బాగుండవు.

దేముడా! ఎటువంటి విషమ పరిస్థితి తెచ్చి పెట్టావు! 'ముందు నుయ్యి, వెనుక గొయ్యి' అన్న



ట్లు చేశావు నా పరిస్థితిని.

మళ్ళీ ఆలోచనల సంఘర్షణకి లోనైం దామె. విష్ణు ఇచ్చిన చీర కట్టుకోవడమే సబబేమో! రేపు కొత్త చీర కట్టుకుంటే పట్టుచీర, కంచి పట్టుచీర కట్టుకుంటే ఇరుగూ పొరుగూ ఆరాలు తీయకమాన రు. 'ఎంత? ఎక్కడ కొన్నారు? ఎవరు తెచ్చారు?' అంటూ అడక్క మానరు. మొగుడు కొన్నాడంటే మురుపేకాని ఈ వయసులో అలా చెప్పుకుని మురిసిపోతే నలుగురూ ముఖంమీదే నవ్వేపోతా రు. నిజాని కీ వయసులో కొడుకు కొన్నాడంటేనే గొప్ప. అవును. లోకం తీరుని బట్టి ఆలోచించినా విష్ణు తెచ్చిన చీర కట్టుకోవడమే ధర్మం.

జానకమ్మకి ఒక క్షణం పాటు సమస్య పరిష్కార మై పోయినట్లూ, మనసు తేలికపడినట్లూ అని పించింది. కళ్ళు మూ సుకుని నడుం వాలుద్దామ నుకుంది. శరీరాన్ని పడక మీదకు చేర్చిందో లేదో మళ్ళీ ఆలోచనలు.

"జానకీ" ప్రేమగా పిలుపు. ఆ కంఠం వారిదే. ఆ గొంతులో ఎంత ప్రేమ. ఎంత అనురాగం. ఈ వయసులో కూడా వారికి తనమీద చాలా ప్రేమ. నిజమయిన అనురాగం వయసు మళ్ళాక ఉండేదే, అంటారు. తను చాలా ధన్యజీవి.

"ఆ పట్టు చీర వెనుక నీపై నాకు గల అనురా గం, ప్రేమ అన్నీ ఉన్నాయి. నా హృదయం ఉంది. ఆనాడు కొనలేకపోయినా ఈనాడయినా కొనగలుగుతున్నానని నేనెంత సంబరపడ్డానో ను వ్వు కోరుకున్న పట్టుచీర తీసుకుంటూ. అదే నువ్వు కట్టుకో. లేకపోతే నా అనురాగానికీ. ప్రేమకీ తీరని ద్రోహం చేసినట్టే" హెచ్చరిస్తున్నట్లూ. ప్రాధేయ పడుతున్నట్లూ. లాలిస్తున్నట్లూ. అర్థిస్తున్నట్లూ కూడా ఉం దాయన కంఠస్వరం.

ఆమె తడబడిపోయింది. భ్రమను నిజమనుకు ని-"అలాగే. అలాగేనండి. తప్పకుండా" అంది బయటికే. ఆమె మనసు ఆ క్షణానికి తేలికైనట్ల నిపించినా మరుక్షణం మళ్ళీ కొడుక్కి అన్యాయం చేస్తున్నానేమో అనిపించింది.

ఒకవేపు భర్త... రెండోవేపు కొడుకు... ఇద్దరూ తనని రెండు వేపులకీ బలమయిన పాశాలు వేసి లాగుతున్నట్లు గిలగిలలాడి పోయిందామె మన సు.

చెరో కొత్త చీరా... తాము కొన్న కొత్త కంచిపట్టు చీరలు... నెమలికంఠం రంగు... మామిడి పిందెల అంచు... వెండి జరీవి...తన పీకకి బిగించి-రెండు వేపులా లాగుతున్నట్లు...ఊపిరాడక ఉక్కిరి బిక్కి రౌతున్నట్లు...

ఆ క్షణాల్లో ఆమె కనిపించింది— "మనిషి దాహంతోనే కాదు, నీళ్ళెక్కువయినా తక్కువ బాధపడడు. తాగడానికి నీరు లేకపోయినా చావే. పరద ముంచెత్తినా చావే."

ఆలోచనలు...సంఘర్షణ...రెండు కొత్త చీరల్లో ఏది కట్టుకోవడం? రెండింటిలో ఏది? ఏది మానె య్యడం? భర్తా, కొడుకా? అనురాగమా అభిమాన మా? గతమా భవిష్యత్తా? ఏది? ఏ ఒక్కటి?

తేలడం లేదు. తెగడం లేదు. కాలం మాత్రం గడిచిపోతోంది. ఆమె కళ్ళవెంట నీళ్ళు వచ్చేస్తున్నా యి. నిద్ర రావడంలేదు. రెండు పట్టుచీరలు...ఆ మెకు ద్విగుణీకృతోత్సాహం బదులు రెట్టింపు బాధ కలుగుతూంది. కోరిక తీరడంలోని అతి ఆమెను యాతన పెడుతూంది. ఇంతకంటె ఇద్ద రూ చీర తేకపోతేనే బాగుండేది అనుకుంటూంది. రెండు చీరలలో ఎవరు తెచ్చింది కట్టుకోవాలి అన్నదే విషమ సమస్య అయిపోయింది. చిక్కువి డని ముడి అయిం దామె పాలిటికి. జటిలమై బాధిస్తూంది. ఎంతాలోచించినా ఎటూ తేలలేదు. ఏ ఒడ్డూ చేరలేదామె ఆలోచనల నావ.

ఎంత సేపలా బాధపడిందో!

చివరకు...గోడమీద వెంకటేశ్వరుడు...ఎదురుగా ...నవ్వుతూ...ఆమె చేతులు జోడించింది. "తండ్రీ! నువ్వే నన్నీ కష్టంనుంచి గట్టెక్కించగల సమర్థుడి వి. దయామయా, ఆపద్బాంధవా! నా సమస్యను నువ్వే పరిష్కారం చెయ్యాలి" అంటూ రెండు చేతులూ జోడించి కళ్ళు మూ సుకుంది భక్తిగా. క్షణాలు...నిముషాలు...నిశ్శబ్దంగా...

"అమ్మా! జానకమ్మగారూ! అంట్లెయ్యరూ?"

పనిమనిషి కేక. తుళ్ళిపడి...సర్దుకుని రెండు చీరలూ హడావిడిగా బిరువాలో పెట్టేసి, తడబ డుతూ వెళ్ళి అంట్లు పడేసింది తోమడానికి.

"ఏమిటమ్మా, అలా ఉన్నారు?"

"ఏమీలేదే...నిద్ర పట్టబోతూంటే పిలిచావు. నిద్ర కలతబారి..." అని-ముందుగదిలోకి వచ్చే సింది. ఇప్పుడయినా ఓ కునుకు తియ్యాలని ఆమె సంకల్పం. లేకపోతే వళ్ళు స్వాధీనం కాదు. భోజన మయ్యాక ఓ కునుకు ఏనాటి నుంచో అలవాటు.

మంచంమీద కూర్చో బోయేసరికి-దృష్టి అప్ర యత్నంగానే బీరువా మీద పడింది. ఏదో శక్తి ఆవహించినట్లు...బీరువా తెరచి రెండు చీరలనూ తెచ్చి పక్కన పెట్టింది. ఒక చీరను తీసి భుజం మీద వేసుకుంది. ఏ భావమూ కలగలేదు-మొద టిసారిలా ఇది-విష్ణు తెచ్చిందేమో అనుకుంటూ ఒడిలో వేసుకుంది. అయినా ఏ అనుభూతీ కలగ లేదు. ఆమె చాలా ఆశ్చర్యపడుతూ-రెండో చీరనూ భుజం మీదా, ఒడిలోనూ మార్చి మార్చి వేసుకుంది. అయినా ఏమీ అనిపించలేదు విచిత్రంగా. రెండిం టినీ చేతుల్లోకి తీసుకుని పట్టి పట్టి చూసింది. ఎంత చూసినా...శల్యపరీక్ష చేసినా...ఏది ఎవ రు తెచ్చారో తేలడంలేదు. రెండూ ఒకేరకం చీర లు. రంగు, అంచు, జరీ, నాణ్యత, ఖరీదు, చివరకు దుకాణం కూడా ఒకటే. ఇద్దరూ ఒకేరకం చీరలు కొన్నారు-ఒకరికి తెలియకుండా ఒకరు కొని ఉంటారు. తెలిస్తే-ఇలా ఎందుకు చేస్తారు? ఔను...తను తన కోరికను బాహాటంగానే చెప్పేది. నెమలికంఠం రంగు, మామిడి పిందెల అంచు, వెండి జరీ అలా వర్ణించి మరీ చెప్పేది. ఖరీదైన పట్టుచీరలు కనుక వాటిలో తేడాలుండవేమో...ఆ రంగులో ఆ అంచువి అన్నీ ఒకేలా ఉంటాయి మో. అందుకే అన్నివిధాలా ఒకేరకం చీరలు రెండు వచ్చాయన్నమాట!

మరి రేపు ఎవరిచ్చినది కట్టుకోవాలి?

ఒక్కక్షణం ఊయలూగింది మనసు. అంతలో నే ఆలోచన...రేపు తను ఈ రెండింటిలోనూ ఏది కట్టుకున్నా అది ఎవరు తెచ్చారో తనకే తెలియ దు! రెండూ అలా కలిసిపోయాయి. ఏ చీర ఎవరు తెచ్చారో తన ఆడకళ్ళే పోల్చుకోలేకపోతే, మగకళ్ళేలా పసికట్టగలవు?

ఒక్కసారామె పెదవుల మీదకు చిరునవ్వొ చ్చింది. కళ్ళల్లోకి వెలుగూ...ముఖంలోకి సమస్య తీరిన ప్రశాంతతా వచ్చాయి. హృదయంలో అలజ డీ, ఆందోళనా, బాధా తొలగాయి. మనసు-మబ్బు విడిన ఆకాశంలా నిర్మలమైంది. ఆమెలో ఊహలు ప్రారంభమయ్యాయి. కలలు చెలరేగాయి.

రేపు—

తను తలంటు పోసుకుంటుంది తెల్లవారుజా మునే. తరువాత కొత్తచీర రెండిటిలోనూ ఏదో ఒకటి తీసి కట్టుకుంటుంది. అప్పటికే భర్త లేస్తారు. వెళ్ళి వారికి పాదాభివందనం చేస్తుంది. ఆ పట్టుచీర-తను తెచ్చినదే అనుకుంటూ-అపరి మితానందంతో-ప్రేమాభిమానాలతో తనని లేవనెత్తి -ఆప్యాయంగా కౌగిట్లోకి తీసుకుంటారు. ఆయన కళ్ళల్లో సంతృప్తి, సంతోషం, గర్వం. తను మెల్లగా వారినుంచి విడిపించుకుని వంటింట్లోకి వెళ్ళి కాఫీ తయారు చేస్తుంది.

అప్పటికి-విష్ణు కూడా లేస్తాడు. కాఫీ కోసం ఎదురు చూస్తుంటాడు. తను చక్కని కాఫీ పట్టు కుని వాడి గదిలోకి వెళ్తుంది. వాడు తన చీరని చూస్తాడు. తను కొన్నదే అనుకుంటాడు. గర్వపడ తాడు.

"చీర చాలా బాగుంది విష్ణూ" అంటుంది తను. వాడు పొంగిపోతాడు. అభిమానంగా చూస్తా డు తనవేపు.

ఊహల్లోని ఆ దృశ్యాలు రెండూ ఎంతో బాగా హాయిగా ఉన్నాయి జానకికి.

ఆమె మనసుకీ హాయిగానే ఉంది. ఔను. ఇందులో తన తప్పేమీ లేదు. పొరపాటున చీరలు రెండూ కలిసిపోయాయి. ఆ పొరపాటే తన సమస్యా పరిష్కారానికి తోవ చూపింది. ఈ పరి ష్కారం వల్ల తను బాధపడనక్కర్లేదు. ఆత్మ వంచన చేసుకోకుండానే అటు వారినీ, ఇటు విష్ణునీ కూడా సంతోష పెట్టొచ్చు. నొప్పించక...తా నొవ్వక...ఇంత చక్కని మార్గాన్ని ఆ దేవుడు...ఏడు కొండలవాడే సూచించాడేమో తనకి!

ఆమెకి హాయిగా నిద్ర పట్టింది.

*

